క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

బంగారుపాళెం: మండల పరిధిలో మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు నాలుగు కార్లు, ఒక ద్విచక్రవాహనాన్ని వేలం వేయనున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు నిర్ణయించిన ధరావత్తు నగదు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

గుడిపాల: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం కొత్తగా మంజూరైన 201 పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కొత్త పింఛన్లను ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10.30 గంటలకు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకహాజరు కావాలని ఆయన తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


పాఠాలు చెబుతున్న ఎంఈఓ–2

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఎంఈఓ–2 కోటీశ్వరయ్య అన్నారు. మంగళవారం పి.కొత్తకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. నాడు–నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు మోడల్ క్లాస్ బోధించారు. మధ్యాహ్న భోజన విషయంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. హెచ్‌ఎం గోపి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి


కంటి అద్దాలు అందజేస్తున్న డాక్టర్ లోహిత్

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగ్రాయన్ తెలిపారు. కీరమంద గ్రామంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను కట్టడి చేద్దాం


కరపత్రాలు అందజేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టి వాటిని కట్టడి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని నగర పాలక కమిషనర్ జె అరుణ అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మంగళవారం రాత్రి నగరంలోని 7వార్డులో పర్యటించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. వ్యాధుల వ్యాప్తి, జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటా అందిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ లోకేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి యూజీ కోర్సులకు వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: స్విమ్స్ యూనివర్సిటీలో పలు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో 2023–24వ విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు బీఎస్సీ (నర్సింగ్), బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బీఎస్సీ (పారామెడికల్) కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వెబ్ ఆప్షన్ ద్వారా పైన తెలిపిన కోర్సులకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. సీట్ల సంఖ్య, ఫీజు వివరాలు, ఎంపిక విధానం వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్ https://svimstpt. ap.nic.inను సందర్శించాలని ఆ ప్రకటనలో కోరారు.

నేడు మంత్రి పర్యటన

నగరి: నియోజకవర్గంలో బుధవారం పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కే రోజా పాల్గొననున్నారు. నగరి, పుత్తూరులో గంగజాతరను పురస్కరించుకుని ఉదయం 10.30 గంటలకు నగరిలో, ఆ తర్వాత పుత్తూరులో అమ్మవారికి సారె సమర్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరి మండలం దామరపాకంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆమె ప్రారంభిస్తారు.

వారంలో సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: పల్లెల్లో సమస్యలను ఎందుకు పట్టించుకోరూ..వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గీతా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అధికారులు గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను చదివి వినిపించారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలపై గొడవ చేశారు. చెర్లోపల్లిలోని పలు భూములు సర్వేకు చలానా కట్టినా కనికరించడం లేదని, సర్వేయర్ అందుబాటులో ఉండడం లేదని, చెరువుల ఆక్రమణపై ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే చింతలగుంటలో రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, భూములు సర్వే చేయడంలో అలసత్వం ఉందని ఎమ్మెల్యేకు విన్నవించారు. గువ్వకల్లులో అంగన్‌వాడీ స్థల సమస్య, శ్మశానదారి సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజాసమస్యల పరిష్కరించడంలో ఎందుకు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి రెవెన్యూకు సంబంధించి ఒక్క సమస్య కూడా రాకూడదని హెచ్చరించారు. పల్లెల అభివృద్ధికి కృషిచేయాలని ఆయన పేర్కొన్నారు. వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు

విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు

- ఘనంగా కణ్ణన్ 96వ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో ఆ పాఠశాల వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యంశెట్టి కుమారుడు బీఎస్.కణ్ణన్ 96వ జయంతి వేడుకలను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తాను ఆరవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకు కణ్ణన్ పాఠశాలలో చదువుకున్నట్లు చెప్పారు. 23 సంవత్సరాలుగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కణ్ణన్ పాఠశాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అనేక ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి విచ్చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బడుల రూపురేఖలు మార్చారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దారని చెప్పారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ మౌలా, పాఠశాల హెడ్‌మాస్టర్ తులసిబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పూల సుబ్రహ్మణ్యం, పూర్వవిద్యార్థులు వాసిరెడ్డి అమర్‌నాథ్, నాగలక్ష్మి, జయప్రకాష్ పాల్గొన్నారు.

గోపీనాథ్‌కు నివాళి


అన్నదానం చేస్తున్న భూపేష్, జ్ఞానేంద్రరెడ్డి.


నివాళులర్పిస్తున్న భూపేష్

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆర్.గోపీనాథ్ 7వ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు నివాళులర్పించారు. సంతపేట కూడలిలో ఆయన కుమారుడు, వైఎస్సార్‌సీపీ నేత భూపేష్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవాస భారతీయుల వ్యవహారాల సలహాదారులు జ్ఞానేంద్రరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ పుష్పాంజలి ఘటించారు. చిత్తూరు రాజకీయ చరిత్రలో గోపీనాథ్ స్థానం ప్రత్యేకమైనదని జ్ఞానేంద్రరెడ్డి తెలిపారు. బీసీల పక్షపాతిగా ఆయన పేరు తెచ్చుకున్నారని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తెలిపారు. సంతపేటలో ఆయన ఇమేజ్, బ్రాండ్ ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటుందని మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ అన్నారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీగా తండ్రి గోపీనాథ్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయని భూపేష్ అన్నారు. అనంతరం పేదలకు బిర్యానీ పంపిణీ చేశారు.

గీతాసారాంశమే మానవాళికి ముక్తి


శ్రీకృష్ణుని గ్రామోత్సవం

బంగారుపాళెం: గీతాసారాంశమే మానవాళికి ముక్తి మార్గమని ప్రబోధానంద భక్తులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, గీతా పారాయణం చేపట్టారు. మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణ భగవానుని ప్రతిమను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిపై కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. ఊరేగింపులో గోపికల వేషధారణలో చిన్నారులు వేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ప్రబోధ సేవా సమితి నిర్వాహకులు బాలాజి, ధనుంజయ పాల్గొన్నారు.

జాతర బందోబస్తును పరిశీలించిన అడిషనల్ ఎస్పీ


గంగమ్మ కొలువుదీరే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

నగరి: గంగ జాతరకు ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును అడిషనల్ ఎస్పీ సుధాకర్ మంగళవారం రాత్రి పరిశీలించారు. గంగమ్మ కొలువుదీరే ప్రాంతంలో ఏర్పాట్లను, గంగమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చే, తరలించే మార్గాలలో ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన పరిశీలించారు. ఆయన వెంట నగరి, నగరి రూరల్ సీఐలు సురేష్, శ్రీనివాసంతి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


ఫెస్ట్‌లో బహుమతులు పొందిన ఆర్‌కే డిగ్రీ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆర్‌కే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆ కళాశాలలో సింపోజియమ్ టెక్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఫెస్ట్‌ను పురస్కరించుకుని బిజినెస్ ఆర్గనైజేషన్‌పై ప్రెజెంటేషన్, క్విజ్, గో గూగుల్ పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ అజయ్ ఉదయ్‌కుమార్, కామర్స్ హెచ్‌ఓడీ ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఐరాల ఉపాధ్యాయుడు


సుబ్రమణ్యంకు సన్మానం

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ అసిస్టెంట్ సుబ్రమణ్యం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సోమవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 9, 11వ తేదీల్లో విజయవాడలో ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో సుబ్రమణ్యం కబడ్డీ, యోగా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను సత్కరించారు. పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీడీ దేవ పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రభుత్వ వైద్యం


ఐరాల: వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పూర్ణలత


గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్


మైనగుండ్లపల్లెలో వైద్యపరీక్షలు


కీనాటంపల్లెలో వ్యాక్సినేషన్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రభుత్వం ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం పాలకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో 95 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గుడిపాలలో ఫ్యామిలీ ఫిజీషియన్..

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ అన్నారు. మంగళవారం మండలంలోని పాపసముద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు 63మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది విజయ, చంద్ర, రుక్మిణి, కవిత, బుజ్జమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

తవణంపల్లె: పేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా గ్రామాల్లో పర్యటించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తవణంపల్లె మండల వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ మోహనవేలు తెలిపారు. మంగళవారం సరకల్లు, మైనగుండ్లపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌ఎన్ రాజామణి పాల్గొన్నారు.

వందశాతం పూర్తిచేయాలి

యాదమరి: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో గ్రామాల్లో వందశాతం వ్యాక్సినేషన్‌ను పూర్తి చేయాలని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. మంగళవారం కీనాటంపల్లెలో సంతగేటు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలు పూర్తిగా నిర్మూలించేందుకు వంద శాతం వ్యాక్సినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు


చెరువు గట్టుపై మొక్కలను పరిశీలిస్తున్న సూర్యకుమారి

ఐరాల: అమృత్ సరోవర్ పనులతో భూగర్భ జలాలను పెంచుకోవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి అన్నారు. మంగళవారం వడ్రంపల్లె గ్రామ పంచాయతీలోని మెట్టఇండ్ల వద్ద రూ.4.40 లక్షలతో ఉపాధి హామీ కింద చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీలో చెరువుల్లో ఇలాంటి పనులు చేపడితే వర్షపు నీరు చేరి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. అమృత్ సరోవర్ కింద చేసిన కుంట లోతు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి చేపల పెంపకం, ప్లాంటేషన్ కింద కొబ్బరి మొక్కలు పెంచి ఆర్థిక వనరులను పెంచుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి, దాతల సహకారంతో అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని చూసి సర్పంచ్‌ను అభినందించారు. జాయింట్ కమిషనర్ శివప్రసాద్, జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్‌ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా డీఆర్‌డీఏ పీడీలు గంగాభవాని, తులసి, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవికుమార్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నివేదికలను వివరించారు. కొత్తూరు ఎస్టీ కాలనీలో ప్రాథమిక పాఠశాల స్థలాన్ని యుగంధర్‌రెడ్డి ఆక్రమించి ప్రహరీగోడ నిర్మిస్తున్నారని ఎంపీపీ మోహన్ తహసీల్దార్ సుశీలమ్మ దృష్టికి తీసుకవెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ మా దృష్టికి సమస్య ఇప్పుడే వచ్చిందని సర్వే చేయిస్తామని తెలిపారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 2,229 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో 1,430 ఇళ్లు పూర్తయ్యాయని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పది పంచాయతీలకు నూతన విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలను అమర్చినట్లు ట్రాన్స్‌కో ఏఈ చలపతి తెలిపారు. ఎంఈఓ దామోదర్ మాట్లాడుతూ నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారయ్యాయన్నారు. మండలంలో తాగునీటి సమస్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కిషోర్ అన్నారు. కాణిపాకం ఆలయ బ్రహ్మోత్సవాలకు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందడం లేదని సభ దృష్టికి గుండ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ ఆలయ ఈఓతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఎంపీడీఓ నాగరాజు, వైస్ ఎంపీపీలు నిత్య, రోజా, కో–ఆప్షన్ మెంబర్ హారూన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకుని దౌర్జన్యం



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్: తమ అనుభవంలోని భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని చిత్తూరు మండలం అయ్యప్పగారిపల్లికి చెందిన నాగరాజు, శివకుమార్, చిట్టిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమకు అరతల గ్రామ రెవెన్యూలోని 1.68 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిని వంశపారంపర్యంగా అనుభవిస్తున్నామన్నారు. అందులో ఏటా వర్షాధార పంటలు చేసుకొని జీవిస్తున్నామన్నారు. తమ గ్రామానికి చెందిన కేశవులు, మారియమ్మ, మరికొందరు ఆ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఫ్యాషన్ 'షో'



ఫ్యాషన్ షోలో వివిధ రాష్ట్రాల మోడల్స్


మాట్లాడుతున్న కేజేఎం డ్రీమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రతినిధులు



ఫ్యాషన్ షోలో మోడల్స్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులోని శిల్పారామం వేదికగా మంగళవారం రాత్రి కేజేఎం డ్రీమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రతినిధులు కవితా కిషోర్, రేయాష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫియస్టా ఆడిక్షన్ ఫ్యాషన్ వీక్ – 2023 ముద్దుగుమ్మలతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని మిత్ర ఫౌండేషన్ ప్రారంభించగా చంద్రగిరికి చెందిన దివా మిస్ ఇండియా ఐకాన్ – 2023 భావన చిన్నతంబు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా మేయర్ శిరీషతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. భావన చిన్నతంబు మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో పాటు లోకల్ ట్యాలెంట్‌ను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మోడల్స్ పాల్గొన్నట్టు వెల్లడించారు. వివిధ రాష్ట్రాల మోడల్స్ నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. మిత్ర ఫౌండేషన్ సభ్యులు రాగిపాల బాలాజు, గోపీకృష్ణ, మోహన్‌రెడ్డి, పెదపూడి ప్రసాద్‌రావు, దామోదర్‌రెడ్డి, మల్లిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చాటుబండి




విద్యుత్ దీప కాంతుల్లో దేవతామూర్తులు

పుత్తూరు రూరల్: గ్రామ దేవత గంగమ్మ జాతర చాటుబండి కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్థానిక శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి గరిగ ఊరేగింపు ప్రారంభమైంది. రాత్రి 8 గంటలకు బజారు వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి కాపు వీధిలోని కేశావాచ్చారి కుటుంబం తయారు చేసిన చాటుబండికి పూజలు చేశారు. అక్కడ నుంచి చాటుబండిని మండపం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అక్కడ నుంచి ఊరేగింపుగా ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు కుంకుమను సమర్పించారు. దివిలి వెంకట్రాయులు మందడి కుటుంబం చాటుబండి బలిదానం ఇచ్చింది. అక్కడ నుంచి కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగపెట్టెను ఊరేగింపు మండపం వద్దకు తీసుకొచ్చి, అన్నంతో దీపం వెలిగించి, పూజలు చేశారు. అనంతరం చాటుబండిని మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ కాపువీధి, బజారువీధి, నగరం రోడ్డు, అమ్మోరుగుంట వీధుల్లో ఊరేగించారు. బజారువీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వేపాకు తోరణాలు, అమ్మవారి ప్రతిమలతో కూడిన విద్యుత్ దీప కటౌట్లతో పట్టణం జాతర సందడి సంతరించుకుంది.